## క్లుప్తంగా

### బిల్కగూడెంలో చేతిపంపునకు మోటారు బిగింపు



సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ జీపీ పరిధిలోని బిల్కగూడెంలో 17కుటుంబాలకు ఒక్కటే బోరు ఉండటంతో అక్కడి ప్రజలు నీటి కోసం గోసపడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో గత నెల 25న 'బిల్కగూడెం–అభివృద్ధికి దూరం' అనే కథనం ప్రచురితమైంది. మార్చి 27న అధికారులు గ్రామాన్ని సందర్శించారు. సమస్యను గురించి గ్రామస్తులతో మాట్లాడారు. పాడైపోయిన మరో బోరుకు మంగళవారం మరమ్మతు చేయించి, వినియోగంలోకి తీసుకొచ్చారు. బోరుకు మోటారు బిగించి డైరెక్ట్ పంపింగ్ సిస్టంను ఏర్పాటు చేయించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అస్మిత తెలిపారు.

### అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



సమీక్షలో డీఏవో కల్పన

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి కల్పన అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్, ఏపీఎం జీనత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### 'ఉపాధి' పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

లక్సెట్టిపేట: ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని డీఆర్డీవో కిషన్ అన్నారు. మండలంలోని గుల్లకోట, మిట్టపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. కూలీలకు పనులు నిర్వహించే ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. అనంతరం కంపోస్ట్ షెడ్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో వేణుగోపాల్, ఈసీ శైలజ, కార్యదర్శులు సురేష్, రాజమణి, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాదాలపై అవగాహన



విన్యాసాలు చేస్తున్న ఫైర్ సిబ్బంది

జన్నారం: అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జన్నారం అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దుకాణా సముదాయాల్లో, ఆటో డ్రైవర్లు, బస్సులోని ప్రయాణికులకు కరపత్రాలు అందజేశారు.

### తృటిలో తప్పిన రోడ్డు ప్రమాదం



డివైడర్ ఎక్కిన లారీ

తాండూర్: మండలంలోని బోయపల్లి వద్ద మంగళవారం జాతీయ రహదారిపై తృటిలో రోడ్డు ప్రమాదం తప్పింది. రోడ్డుపై వెళ్తున్న లారీ ఒక్కసారిగా డివైడర్‌ను, ఆ పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండి డ్రైవింగ్ చేయడం వల్ల లారీ డివైడర్ ఎక్కినట్లు తెలుస్తోంది. తృటిలో ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



కొత్తూరు గ్రామంలో నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

# నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

- దాతలు సహకరించినా పట్టింపు కరువు
- కరెంట్ బిల్లు కట్టని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

లక్సెట్టిపేట: మండలంలోని కొత్తూరు గ్రామంలో ప్రజల దాహం తీర్చేందుకు దాతలు ముందుకొచ్చి ఉచిత వాటర్ ప్లాంట్ నిర్మిస్తే నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం గ్రామానికి ట్రాలీలలో వస్తున్న వాటర్ డబ్బాల నీటిని కొనుగోలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామానికి చెందిన ఎన్నారై గుండా అమర్‌నాథ్, నాటా వారి ఆధ్వర్యంలో 2021లో సుమారు రూ.లక్షలతో గ్రామంలో ఉచిత ఆర్వో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పజెప్పారు. కొద్ది నెలలు పరిపూర్ణంగా సాగిన వాటర్ ప్లాంట్, అనతి కాలంలోనే నిర్వహణ లోపంతో నిరుపయోగమైంది. గ్రామస్తులు ఉచితంగా తాగునీటిని తీసుకెళ్లేవారు. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉండడంతో గ్రామ ప్రజలతో పాటు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించారు. కానీ గత రెండేళ్లుగా నిర్వహణ లేక వాటర్‌ప్లాంట్ నిరుపయోగంగా మారింది. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి.

**బిల్లు చెల్లించకపోవడంతో..**

వాటర్ ప్లాంట్‌కు అయ్యే విద్యుత్ బిల్లును గ్రామ పంచాయతీ అధికారులు చెల్లిస్తామని తెలిపారు. కానీ జీపీలో నిధులు లేవని బిల్లు చెల్లించకపోవడంతో రూ.30వేల బిల్లు బకాయి పడినట్లు జీపీ అధికారులు పేర్కొంటున్నారు. ఫిల్టర్‌లను మరమ్మతు చేయించకపోవడంతో చెడిపోతున్నాయి. దీంతో గ్రామ ప్రజలు తాగునీటిని డబ్బాకు రూ.20లు చెల్లించి కొనుగోలు చేసి తాగుతున్నారు. మిషన్‌భగీరథ నీరు నాణ్యతగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వాటర్ ప్లాంట్ కరెంటు బిల్లు చెల్లించి మరమ్మతు చేయించాలని, ప్రజలకు ఉచిత తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

**వినియోగంలోకి తేవాలి..**



గ్రామంలోని ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను వెంటనే మరమ్మలు చేయించి వినియోగంలోకి తీసుకు రావాలి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు కొనుగోలు చేస్తూ డబ్బులు వృథా చేసుకుంటున్నారు. అధికారులు పట్టించుకొని త్వరగా ప్రారంభించాలి.

– మోటపల్కుల శ్రీనివాస్, కొత్తూరు

**బిల్లు చెల్లించకపోవడంతోనే..**

వాటర్ ప్లాంట్ కరెంటు బిల్లు బాకాయి ఉండడంతో వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. జీపీలో నిధులు లేకపోవడంతో బిల్లు చెల్లించలేదు. ప్లాంట్‌లో కొన్ని మరమ్మతులు జరిపించాలి. త్వరలోనే ప్రారంభించడానికి ఉన్నతాధికారులతో మాట్లాడుతాం.

– రాజేశ్, పంచాయతీ కార్యదర్శి, కొత్తూరు

## కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



ఎర్రగుంటపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్‌రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లి, నాగాపూర్, పొన్నారం, బీరెల్లి, సోమనపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బీరెల్లిలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కర్ణాల లింగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్నరకం వడ్లకు రూ.500 బోనస్, పేద ప్రజలకు సన్నబియ్యం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమనపల్లిలో పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ఆస్నాదలో నిర్వహించిన ఎల్లమ్మ తల్లి పట్నాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## ఆకెనపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

- రూ.3.49కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ



ప్రభుత్వ భూమిని సర్వే చేస్తున్న అధికారులు

బెల్లంపల్లి: మండలంలోని ఆకెనపల్లి గ్రామ శివారు ప్రాంతంలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి ఎన్పీడీసీఎల్ నుంచి పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ వరంగల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకెనపల్లి శివారు సర్వే నంబర్ 64లో ఉన్న 30గుంటల ప్రభుత్వ భూమిని ఇటీవల తహసీల్దార్ జ్యోత్స్న పర్యవేక్షణలో సర్వే చేసి గుర్తించారు. ఈ ప్రాంతంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి లింగాపూర్, ఆకెనపల్లి, పాత బెల్లంపల్లి, బుచ్చయ్యపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయనున్నారు. కొత్తగా సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం రూ.3.49 కోట్లు ప్రతిపాదించగా ఎన్పీడీసీఎల్ నుంచి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆకెనపల్లి ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం ఏళ్ల తరబడి నుంచి యత్నాలు చేస్తుండగా ఇన్నాళ్లకు కానీ మోక్షం కలగలేదు.

### మెరుగైన విద్యుత్ సరఫరా

చెన్నూర్: చెన్నూర్‌తో పాటు గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం వేసవి ప్రణాళికలో భాగంగా 5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పీటీఆర్ స్థానంలో కొత్త 8 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పీటీఆర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యుత్ అధికారి గంగాధర్ అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 8ఎంవీఏ సామర్థ్యం కలిగిన పీటీఆర్‌ను ప్రారంభించారు. డీఈలు కైసర్, రాజన్న, ఏడీఈ బాలకృష్ణ, ఏఈలు శ్రీనివాస్, రమేశ్‌లు పాల్గొన్నారు.

## 'ఏఆర్ఎస్'లో వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జన్నారం: మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఏఆర్ఎస్ విద్యాసంస్థల చైర్మన్ అజ్మీరా శ్యాం నాయక్ హాజరై విద్యార్థులకు పలు అంశాలను బోధించారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ముత్యం సతీశ్, నాయకులు పాయల శంకర్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



కిషన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తిరుపతి

కాసిపేట: మండలంలోని కుర్రెఘడ్ గ్రామానికి చెందిన కుర్సింగ భూదేషా తల్లి, పల్లంగూడకు చెందిన వెడ్మ కిషన్ విద్యుత్ షాక్‌తో ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం కుర్రెఘడ్‌లోని కూపార్ లింగుస్వామి ఆలయాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. మంచిర్యాల జిల్లా కో ఆర్డినేటర్ వేముల కృష్ణ, మాజీ ఎంపీటీసీలు మడావి భీంరావు, పార్వతి మల్లేష్, ఆదివాసీ సేన మండలాధ్యక్షుడు మడావి వెంకటేష్, ఆదివాసీ సేనా గౌరవాధ్యక్షుడు మడావి గంగారాం, నాయకులు పాల్గొన్నారు.

## ఆఫ్‌లైన్‌లో 'యువ వికాసం' దరఖాస్తులు



దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువు ఈ నెల 14 సోమవారంతో ముగిసింది. వెబ్‌సైట్‌లో దరఖాస్తు గడువు పూర్తయినట్లుగానే చూపిస్తోంది. కానీ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోని వారు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయానికి రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. గడువు తేదీ ముగిసిందని ఉద్యోగులు తెలిపినా మంగళవారం 350మంది దరఖాస్తులు అందజేశారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈ నెల 21, 22న నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి జాడి పోశం, అధ్యక్షుడు వడ్లకొండ వెంకన్న అన్నారు. మంగళవారం సాయంత్రం బెల్లంపల్లిలోని గంగారాం విజ్ఞాన భవన్ సీపీఐ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొంకుల రాజేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి అడెపు రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యులు అక్కెపల్లి బాపు, నాయకులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి

మంచిర్యాలటౌన్: గర్భిణులు, బాలింతలు, పిల్లలు సరైన పౌష్టికాహారం తీసుకుంటేనే పూర్తి ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్కలవాడ–2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు పౌష్టికాహారం, పోషక విలువలపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సరిత, ఆర్పీలు సునీత, స్వాతి, అంగన్‌వాడీ టీచర్ పి.సురేఖ, ఏఎల్ఎంఎస్ కమిటీ సభ్యులు నాగమణి, రజిత, విజయ, గౌరి పాల్గొన్నారు.

తాండూర్/లక్సెట్టిపేట/మందమర్రిరూరల్: తాండూర్ మండలం మాదారం సెక్టార్ పరిధి అంగన్‌వాడీ కేంద్రంలో, లక్సెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్‌లో చిన్నారులకు బరువు, ఎత్తును పరిశీలించారు. గర్భిణులకు, చిన్నారులకు ఆరోగ్య సూత్రాలు తెలియపర్చారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట సీడీపీవో రేష్మ, సూపర్‌వైజర్ మమత, కార్యదర్శి సునీత, తాండూర్‌లో ఐసీడీఎస్ బెల్లంపల్లి సీడీపీవో స్వరూప, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ ఎనగంటి సువర్ణ, కార్యదర్శి తోఫిక్, చిన్నారులు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు. మందమర్రిలో పలు అంగన్‌వాడీల్లో జరిగిన కార్యక్రమాలకు ఎంపీడీవో రాజేశ్వర్ హాజరయ్యారు.

### యుడైస్ ప్లస్ సర్వే షురూ

మంచిర్యాలఅర్బన్: యుడైస్ ప్లస్‌లో నమోదైన వివరాలపై మంగళవారం సర్వే ప్రారంభమైంది. 708 పాఠశాలల్లో డైట్ విద్యార్థులు 70 మంది పరిశీలించారు. ఒక్కో విద్యార్థి రెండు చొప్పున 10 పాఠశాలలను క్షేత్రస్థాయి తనిఖీ చేపట్టారు. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితుల వివరాలన్నీ యుడైస్‌లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేశారా..? లేదా పలు విషయాలపై ఆరా తీశారు. ఈ నెల 21 వరకు సర్వే కొనసాగుతుందని డీఈవో యాదయ్య తెలిపారు.

**పాఠశాలలో సౌకర్యాల పరిశీలన**

కోటపల్లి: మండలంలోని 15 పాఠశాలలు, సిర్సా కాంప్లెక్స్ పరిధిలో 15 పాఠశాలలు, దేవులవాడ కాంప్లెక్స్ పరిధిలో 17 పాఠశాలలను మంగళవారం డీఎడ్ విద్యార్థులు పరిశీలించినట్లు సీఆర్పీ సంపత్ తెలిపారు. పాఠశాలలో సదుపాయాలు, మౌలిక వసతులు పరిశీలించారు. కస్తూర్బాగాంధీ ఎస్‌వో హరిత, డీఎడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

### రాజ్యాంగ పీఠిక పఠించడం అదృష్టం

చెన్నూర్: అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ పీఠికను పఠించడం అదృష్టంగా భావించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక చదివించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బత్తుల సమ్మయ్య, నాయకులు వెంకన్న, శ్రీపాల్, లక్ష్మీనారాయణరెడ్డి, శివకృష్ణ, శంకర్, అడప శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సంక్షేమ గురుకులాల్లో ఫోన్ మిత్ర సౌకర్యం

బెల్లంపల్లి: గురుకులాల్లోని విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 'ఫోన్ మిత్ర' సౌకర్యం కల్పిస్తోంది. ఈ మేరకు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి సానుకూల నిర్ణయం తీసుకున్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని గౌలిదొడ్డిలో ఉన్న గురుకుల విద్యాలయంలో ఫోన్‌మిత్ర సౌకర్యాన్ని ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే రాష్ట్రమంతటా విస్తరించనున్నారు. ఈ సదుపాయం వల్ల బాలబాలికలు తల్లిదండ్రులకు ఫోన్ చేసే కష్టాలు దూరం కానున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా(నిర్మల్ జిల్లా మినహాయించి)లో 17సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు ఉన్నా యి. పెద్దపల్లి జోన్ పరిధిలోని సంక్షేమ గురుకులాల్లో ఫోన్‌మిత్రలను అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపట్టారు. ఈ నెల 17 నాటితో 5నుంచి 9వ తరగతి పరీక్షలు ముగి యనున్నాయి. ఆలోపే లేదా మరికొద్ది రోజు ల వ్యవధిలో ఫోన్‌మిత్రలను గురుకులాల్లో బిగించేలా కార్యాచరణ రూపొందించారు.

## సేవాలాల్ ఆలయంలో భోగ్‌బండార్



అగ్ని హోమంలో నైవేద్యం వేస్తున్న పీఠాధిపతి

భీమారం: మండలంలోని బూర్గుపల్లి గ్రామం శ్రీ సేవాలాల్ ఆలయంలో మంగళవారం భోగ్ బండార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోహరాదేవీ శక్తి పీఠాధిపతి శేఖర్ మహారాజ్ పాల్గొన్నారు. భోగ్ బండార్‌లో భాగంగా అన్నిరకాల నైవేద్యాలను అగ్నికి ఆరగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామంలో సేవాలాల్ ఆలయాన్ని నిర్మించి భక్తి శ్రద్ధలతో భోగ్ బండార్ జరపడం సంతోషంగా ఉందన్నారు. తాండాకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## గుడుంబా అమ్మొద్దు.. జీవితాలు కూల్చొద్దు

- పుష్పగుచ్ఛం అందించి వినూత్నంగా కౌన్సెలింగ్ ఇచ్చిన ఎస్సై శ్యాం పటేల్

వేమనపల్లి: గుడుంబా అమ్మొద్దు.. జీవితాలను నాశనం చేయొద్దని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వినూత్న రీతిలో గుడుంబా అమ్మకందారుల ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి గుడుంబా అమ్మకండి.. కుటుంబాల్లో చిచ్చుపెట్టకండి అంటూ వారికి అవగాహన కల్పించారు. మండలంలోని మామిడిపల్లి, సూరారంలో విచ్చలవిడిగా గుడుంబా అమ్మకం వల్ల గ్రామాల్లో కుటుంబ తగాదాలు ఎక్కువై, అనారోగ్యంపాలై ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ విషయమై స్థానిక యువత ఎస్సై దృష్టికి తీసుకురాగా ఇటీవల గుడుంబా అమ్మకాలు జరుపుతున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేశారు. దీంతో గ్రామంలో సిడాం సమ్మక్క, కోర్తె చంద్రక్క ఇళ్లకు వెళ్లి మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్న, పెద్ద తేడా లేకుండా గుడుంబాకు బానిసవుతున్నారని, గుడుంబా అమ్మకాలు నిలిపివేయాలని కోరారు. లేనిపక్షంలో అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామాల్లోని యువత, మహిళలు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**• చెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక**

మందమర్రిరూరల్: చెస్ అసోసియేషన్ జిల్లా కమిటీని రాష్ట్ర కమిటీ మంగళవారం ప్రకటించింది. జిల్లా అధ్యక్షుడిగా మందమర్రికి చెందిన దామెర్ల సిద్ధయ్య, ఉపాధ్యక్షులుగా ఆర్.విష్ణువర్ధన్, డింగరి కృష్ణకాంత్ ఆచార్య, ప్రధాన కార్యదర్శిగా ఈగ అన్వేష్, అదనపు కార్యదర్శిగా ఏ.లక్ష్మీనారాయణ, కోశాధికారిగా సమ్మిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సుజన్ రెడ్డి, అదనపు సంయుక్త కార్యదర్శిగా కే.కుమార్, వొడపల్లి విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా చేదం అనూష, కార్య నిర్వాహకులుగా కొప్పుల సత్తయ్య, కాసర్ల తిరుపతి, జనగామ సతీశ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల కమిటీ పరిశీలకులుగా తెలంగాణ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.జనార్దన్ వ్యవహరించారు.

**• పరిహారం చెక్కు అందజేత**

జన్నారం: తోడేలు దాడిలో గొర్రెలను నష్టపోయిన రైతుకు అటవీశాఖ నుంచి మంజూరైన పరిహారం చెక్కును మంగళవారం ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. 2024 డిసెంబర్ 6న మండలంలోని మురిమడుగుకు చెందిన రైతు దానవేని రాజంకు చెందిన గొర్రెల మందపై తోడేలు దాడి చేసి 11గొర్రెలను హతమార్చింది. సెక్షన్ అధికారి రవి ఆధ్వర్యంలో పంచనామ చేసి, ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రైతుకు పరిహారంగా రూ.65వేలు మంజూరు చేయడంతో ఆ చెక్కును రైతుకు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రవి, బీట్ అధికారి మహేశ్వర్, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, మాజీ ఉప సర్పంచ్ రాజేశ్వర్ తదితరులున్నారు.

**• ప్రభుత్వ పథకాలపై సమీక్ష**

కాసిపేట: ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల ప్రత్యేకాధికారి పురుషోత్తంనాయక్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల గ్రీవెన్స్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు ఈ నెల 30వరకు పరిశీలనపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

**• తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి**

లక్సెట్టిపేట: వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి అవినాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలని, నర్సరీల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో సరోజ, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వేణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

**• రోడ్డుపై దిగబడిన డీసీఎం**

వేమనపల్లి: రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మండల ప్రయాణికులకు శాపంగా మారింది. మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీలో ఆర్‌అండ్‌బీ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతుండగా గుంతల్లో ఎర్రమట్టి పోయించారు. డ్రైనేజీ నుంచి వచ్చే మురికి నీటితో కలిసి ఎర్రమట్టి చిత్తడిగా మారింది. దీంతో రోడ్డుపై నుంచి సరుగుడు కలప లోడ్‌తో వెళ్తున్న వాహనం దిగబడింది. సుమారు 4గంటలు కష్టపడినా ఫలితం దక్కలేదు. మండల కేంద్రానికి విధులకు హాజరయ్యేందుకు వచ్చే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రావడానికి ఇబ్బందులు పడ్డారు. రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక మాజీ సర్పంచ్ గాలి మధు, ఎస్సై శ్యాంపటేల్ సహకారంతో ట్రాక్టర్, జేసీబీ సాయంతో వాహనాన్ని బయటకు లాగారు.

**• 'మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు'**

మంచిర్యాలఅర్బన్: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని మంచిర్యాల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి అన్నారు. మత్తు పదార్థాల నిరోధక కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మత్తు పదార్థాల నిరోధక కమిటీ కో–ఆర్డినేటర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

**• తల్లీకూతుళ్ల అదృశ్యం**

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్‌కు చెందిన తల్లీకూతుళ్ల అదృశ్యమైనట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గౌతం రాథోడ్ భార్య సరస్వతి రాథోడ్(34), కూతురుతో కలిసి ఈ నెల 10 నుంచి కనిపించడం లేదని పేర్కొన్నారు. గౌతం రాథోడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.